ప్రజాశక్తి
మంగళవారం 16 డిసెంబర్ 2025 5
శ్రీ సత్యసాయి

డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆశాలు, సిఐటియు నాయకులు

సోలార్‌కు 8 వేల ఎకరాలు..!



- ఆగని సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల మంజూరు
- మడకశిర ప్రాంతంలో 1700 మెగావాట్లు
- రాయదుర్గం ప్రాంతంలో 300 మెగావాట్లకు అనుమతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు ఆగడం లేదు. తాజాగా మడకశిర, రాయదుర్గం ప్రాంతంలో రెండు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఈ మేరకు రెండు ప్రాజెక్టులకు కలిపి సుమారు ఎనిమిది వేల ఎకరాల వరకు భూమిని సేకరించే అవకాశముంది. ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంజూరైన సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల అనుమతుల వరకు చూస్తే మొత్తం లక్ష ఎకరాలకు చేరుతోంది. ఇంకా అదనంగా వస్తే జిల్లాలో ఏ మేరకు వ్యవసాయ భూములు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు పోతాయోనన్న చర్చ నడుస్తోంది.

మడకశిరలో 1700 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు

మడకశిర నియోజకవర్గం పరిధిలోని మడకశిర, గుడిబండ మండలాల పరిధిలో 1700 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. చింతా గ్రీన్ ఎనర్జీ అనే సంస్థకు ఈ అనుమతులిచ్చింది. ఇందులో మడకశిర, గుడిబండ మండలాల్లోని పలు గ్రామాలున్నాయి. కేకాతి, చిగతుర్తి, కరికేర, హరేసముద్రం, బుల్లసముద్రం, మానేరు, మేలవోయి, ఊగేపల్లి, పాపసానిపల్లి, చంద్రకచర్ల, గౌడనహళ్లి, ఆర్.అనంతపురం గ్రామాల పరిధిలో ఈ సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ఒక్క మెగావాట్‌కు సగటున నాలుగు ఎకరాల వరకు భూసేకరణ జరుగుతోంది. ఈ మేరకు ఈ గ్రామాల పరిధిలో మొత్తం 6800 ఎకరాల వరకు భూమిని చింతాగ్రీన్ ఎనర్జీ సేకరించే అవకాశముంది. ఏడాదికి రూ.31 వేల చొప్పున లీజు పద్ధతిలో ఈ భూమిని సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చి ఉంది.

రాయదుర్గం పరిధిలో 300 మెగావాట్లు

రాయదుర్గం నియోజకవర్గం పరిధిలోని కణేకల్, బొమ్మనహాళ్ మండలాల పరిధిలో 300 మెగావాట్ల విద్యుత్ ఉత్పతికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. గనేకో త్రీ ఎనర్జీ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు ఈ అనుతులిచ్చింది. ఈ సంస్థ హైబ్రీడ్ పద్ధతుల్లో అంటే సోలార్, విండ్ కలగలపి విద్యుత్ ఉత్పత్తిని చేపట్టనుంది. ఈ సంస్థ కణేకల్, బొమ్మనహాళ్ మండలాల్లో ఏర్పాటుకు అనుతులిచ్చింది. అయితే ఏ గ్రామాల్లో అన్నది నిర్ధిష్టంగా తెలుపలేదు. ఏడాదికి రూ.31వేల లీజు పద్ధతుల్లోనే ఈ సంస్థకూ అనుతులిచ్చియున్నారు. ఈ రకంగా రెండు అనుమతుల ప్రకారం చూస్తే సుమారు ఎనిమిది వేల ఎకరాల వరకు వ్యవసాయ భూమి సోలార్ పద్ధతుల్లో తీసుకునేందుకు వీలుంటుంది. ఇంత పెద్దఎత్తున భూములు సోలార్‌కు పోతున్న క్రమంలో గ్రామాల్లో పరిస్థితులు రాబోయే రోజుల్లో ఏ రకంగా ఉండనుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఏడాదికి లీజు రూ.31 వేలు కాకుండా దీన్ని పెంచి ఇవ్వాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

ఆశాలను ఇబ్బంది పెడితే ఊరుకోం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి
డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ఆందోళన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఆశాలకు సంబంధం లేని పనులను చేయిస్తూ వారిని మానసిక ఒత్తిడికి గురి చేస్తే చూస్తూ ఊరుకోమని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి హెచ్చరించారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నాడు పుట్టపర్తి డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జివిల్.నరసింహులు, కోశాధికారి లక్ష్మీనారాయణ తదితరులు ఆశాల ఆందోళనకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులను వైద్య సిబ్బంది చేయించడం సరికాదన్నారు. వైద్యులు, ఎంహెచ్‌పిలు, స్టాఫ్ నర్సులు చెప్పిన పనులన్నీ ఆశాలు చేయాల్సి వస్తోందన్నారు. చాలీచాలని వేతనం ఇస్తూ ఆశాలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకకాలంలో ఒకేసారి నాలుగు సర్వేలు చేయమంటే ఏ విధంగా చేస్తారని అధికారులను ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యికి ఒక్కరిని పట్టణ ప్రాంతాల్లో 2500 మందికి ఒక ఆశ కార్యకర్తను నియమించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1700 మంది ఆశా వర్కర్లు ఉన్నారని, వారందరికీ పెరిగిన ధరల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అన్ని రకాలా సెలవులనూ వీరికి వర్తింపజేయాలన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

ఆశలు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం బయట ఆందోళనను కొనసాగించారు. మధ్యాహ్నం 2 గంటలు దాటినా ఆందోళన శిబిరం వద్దకు అధికారులొచ్చి సమస్యలను వినకపోవడంతో సిఐటియు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశాలతో కలిసి సిఐటియు నాయకులు డిఅండ్‌హెచ్‌ఒ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. డిఎంహెచ్‌ఒ ప్రధాన ద్వారం ముందు బైటాయించి నినాదాలు చేశారు. కలెక్టరేట్లో ఉన్న డిఎంహెచ్‌ఒ ఫైరోజ్‌బేగం వెంటనే ఆందోళన శిబిరం వద్దకు చేరుకున్నారు. ఆశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆందోళన విషయం తనతకు తెలియదని, ఆశ వర్కర్లను తామెప్పుడు ఇబ్బందులకు గురి చేయలేదన్నారు. డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లాకు ఒక్కరే ఉన్నందున కొన్ని సమస్యలు అపరిష్కృతంగా ఉన్న మాట వాస్తవమే అన్నారు. గల్ల పరీక్షలకు ఆశలకు సంబంధం లేదని, వైద్య సిబ్బంది సర్వేలకు వెళ్తే ఆశాలు వారి వెంట మాత్రమే వెళ్లాలని సూచించామన్నారు. మిగిలిన సమస్యలను కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సాంబశివ, సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, ఆటో బాబా, నాగరాజు, ముత్యాలు, ఆశ వర్కర్ల సంఘం నాయకులు సౌభాగ్య, రమాదేవి పాల్గొని ప్రసంగించారు.

టిటిడిలో ధర్మవరం పట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

టిటిడిలో ధర్మవరం పట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలుగుదేశం నాయకులు పరిసే సుధాకర్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ సభ్యులు మడకశిర శాసన సభ్యులు ఎం ఎస్ రాజును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మవరం చేనేత రంగంలో రూ.5వేలు మొదలుకొని రూ.5లక్షల దాకా విలువైన చీరలు ఉన్నాయన్నారు. ఇది ఇక్కడి చేనేత కార్మికుల కళా నైపుణ్యతకు నిదర్శనమని, అత్యాధునిక డిజైన్లలో, నాణ్యతలో ధర్మవరం చేనేత ప్రపంచ ఖ్యాతి పొందిందని వివరించారు. రాష్ట్రంలో ఉన్న అతిపెద్ద హిందూధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం వారు టీటీడీ కి సంబంధించిన పట్టు వస్త్రాలను ఇంతటి కళాత్మకమైన ధర్మవరం చేనేత నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుండికొనుగోలు బాధాకరమన్నారు. మంగళవారం జరిగే టీటీడీ బోర్డు సమావేశంలో ఈ ప్రస్తావన తీసుకురావాలని పరిసే సుధాకర్ ఎమ్మెల్యే ఎంఎస్ రాజును కోరారు. ఈమేరకు వినతి పత్రం అందజేశారు,ఈ కార్యక్రమంలో నాయకులు బీమినేని ప్రసాద్, రాళ్లపల్లి షరీఫ్, గడ్డం సూరి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పుట్టపర్తిలో ప్రదర్శన చేస్తున్న డప్పుకళాకారులు

జిల్లా మహాసభల్లో ప్రసంగిస్తున్న ఓ.నల్లప్ప

సామాజిక వృత్తులపై పాలకుల వివక్ష

డప్పుకళాకారుల సమస్యలను పరిష్కరించాలి - 2వ జిల్లా మహాసభల్లో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సామజిక వృత్తులపై పాలకులు, ప్రభుత్వాల వివక్ష ఇంకెంత కాలం కొనసాగుతుందని కెవిపిఎస్, డప్పుకళాకారుల సంఘం నాయకులు ప్రశ్నించారు. పుట్టపర్తి పట్టణం అబ్దుల్ కలాం షాదీఖానా ఫంక్షన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం సత్య సాయి జిల్లా రెండవ మహాసభలను సోమవారం నిర్వహించారు. ముందుగా పుట్టపర్తి గణేష్ కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డప్పు కళాకారుల సంఘం జిల్లా నాయకులు హనుమయ్య అధ్యక్షతన జరిగిన మహాసభలకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, డప్పుకళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.ఆనంద్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి డప్పు కళాకారున్నీ గుర్తించి వారికి డప్పు పండగ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి సాంప్రదాయ కళను గౌరవించాలన్నారు. పింఛన్‌ను రూ.7వేలకు పెంచాలన్నారు. పింఛన్ మంజూరు వయసును 45 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. డప్పు గుర్తింపును పోరాడి సాధించి 12 సంవత్సరాలు పూర్తయినా నేటికీ గుర్తింపు లేని కళాకారులు వందల సంఖ్యలో ఉన్నారన్నారు. డప్పు కళాకారులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు పింఛన్ ఆన్లైన్ వెంటనే విడుదల చేయాలన్నారు. వయసుతో సంబంధం లేకుండా డప్పు కళాకారులందరికీ డప్పు, గజ్జలు, డ్రెస్సు ఇవ్వాలన్నారు. ప్రయాణాల్లో రాయితీ, ప్రమాద బీమా సౌకర్యం, ఆత్మగౌరవంగా బతికేందుకై రెండు ఎకరాల భూమి, ప్రభుత్వ పథకాల ప్రచారంలో ప్రథమ అవకాశం ఇవ్వాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జనవరి 3,4న విశాఖపట్నంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డప్పు కళాకారులను సమీకరించి ఉద్యమించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎన్‌వి.రమణ, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, కాటికాపరుల సంఘం జిల్లా నాయకులు యోగానంద, రవి, కెవిపిఎస్ అనుబంధ మహిళా సంఘం అధ్యక్షురాలు సరస్వతి, ప్రధాన కార్యదర్శి జ్యోతితో పాటు జిల్లాలోని డప్పు కళాకారులు పాల్గొన్నారు.

8,9,10న మిల్లెట్ మేళా

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఎన్జీవోల ఫోరమ్ అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో జనవరి 8,9,10వ తేదీల్లో మిల్లెట్ మేళా-2026 జరగనుంది. మిల్లెట్ మేళాకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో కలెక్టర్ ఓ.ఆనంద్ ఆవిష్కరించారు. అనంతపురం కేంద్రంగా మూడవ ఎడిషన్ మిల్లెట్ మేళా జరగనుంది. సహజ వ్యవసాయం, ఆహార ఉత్పత్తి, మార్కెటింగ్, స్థానిక వినియోగంపై అవగాహన పెంచేలా ఈ కార్యక్రమం జరగనుంది. మిల్లెట్లు, తృణధాన్యాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించేలా ఈకార్యక్రమం నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఎవిఎస్ఎస్ సభ్యులు, ఎన్జీవోలను కలెక్టర్ అభినందించారు. అనంతరం అసియన్ ఫ్రటెర్నా ఎకాలజీ సెంటర్ నూతన సంవత్సర 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

ఇంధన పొదుపే అభివృద్ధికి మూలాధారం : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

భవిష్యత్ తరాలకు సుస్థిరమైన జీవన విధానం అందించాలంటే ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపును తమ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సత్యమ్మ గుడి వద్ద జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. 'ఇంధనం పొదుపు చేద్దాం - భావితరాలకు వెలుగునిద్దాం' అనే నినాదంతో సత్యమ్మ గుడి వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్, కలెక్టరేట్, గోకులం మీదుగా గణేష్ సర్కిల్ నందలి పవర్ హౌస్ వరకు సాగింది. అంతకు మందు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 20 వరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంధన వనరులు పరిమితమైనవని, వాటిని సమర్థవంతంగా వినియోగించినప్పుడే ఆర్థిక భారం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. అవసరం లేని సమయంలో లైట్లు, ఫ్యాన్లు ఆపడం, విద్యుత్ పొదుపు పరికరాల వినియోగం, పునరుత్పాదక ఇంధన వనరులపై దృష్టి సారించడం ద్వారా ప్రతి కుటుంబం ఇంధన పొదుపులో భాగస్వాములవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ క్రాంతి, విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి నియామకానికి చేయూత

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలోని వివర్స్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అవసరార్థం భౌతిక శాస్త్ర బోధకుడిని నియమించుకోవడానికి కదిరి సిమ్స్ హాస్పిటల్ ఎండి బి. నిసార్ యాసిన్ చేయూతనందించారు. వీవర్స్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో 972 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ముగ్గురు భౌతిక శాస్త్ర సహాయకులను నియమించాలి., కానీ ప్రస్తుతం ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. ఈ నెలలో విడుదలైన అకడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులు కూడా మంజూరు కాకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ , ఉపాధ్యాయులు విన్నపం మేరకు కదిరి సిమ్స్ హాస్పిటల్ ఎండి బి నిసార్ యాసిన్ ఖాన్ నెలకు పదివేల రూపాయల చొప్పున ఈ విద్యా సంవత్సరం ముగిసే వరకు ఒక ఉపాధ్యాయుని నియమించుకుంటే ఇస్తానని వాగ్దానం చేశారు. ఆయన చేసిన వాగ్దానం ప్రకారం మున్సిపల్ కౌన్సిలర్లు రమణ నాయుడు, రవి మరియు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి శ్రీనివాసులు పట్టణ యుటిఎఫ్ అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రెడ్డి రాజేష్ సమక్షంలో బ్యాంక్ చెక్‌ను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ వైస్ చైర్మన్ ఆంజనేయులు ఉపాధ్యాయులు సుధాకర్, భార్గవ, పవన్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం

ప్రజాశక్తి ఓబుల దేవర చెరువు

మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణం నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేశారని ఆర్‌సిపి నియోజకవర్గం కార్యదర్శి మున్నా, రైతు సంఘం నాయకులు రామచంద్ర, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సురేష్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు వారు సోమవారం మాట్లాడుతూ మండలంలో రెండు మద్యం దుకాణాలున్నాయన్నారు. అందులో ఒకటి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విజ్ఞాన్ కాలేజీ, హైస్కూల్ ఎదురుగా నిర్వహిస్తున్నారన్నారు. ఇది విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. ఈ దుకాణాన్ని గ్రామం బయట ఏర్పాటు చేయాలన్నారు. ఇదే అంశం పైనా గతంలో ఉద్యమాలు కూడా చేశామని అయినా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు శివమ్మ, నాయకులు గంగులప్ప, శ్రీనివాసులు, ఉత్తప్ప, శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఒసి కోసం మాజీ సైనికుని వారసుడి తంటాలు

వారసత్వ భూమికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వని వైనం



తన సమస్యను వివరిస్తున్న బాధితుడు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

స్వాతంత్ర్యం రాకమునుపే భారత సైన్యంలో చేరి దేశానికి విశేష సేవలు అందించిన మాజీ సైనికుడు గఫూర్ ఖాన్ వారసుడు నేడు కనీస న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో భారత్ తరపున పాల్గొని, ఆ తర్వాత కూడా ప్రభుత్వ సేవల్లో కొనసాగిన గఫూర్ ఖాన్ కుటుంబానికి సంబంధించిన వారసత్వ భూమికి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఒసి) ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని బాధితుడు ఆర్. మహమ్మద్ ఖాన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సోమవారం శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించిన ఆయన జిల్లా కలెక్టర్‌ను కలిసి తన గోడును వినిపించారు. తన తండ్రి దేశానికి అందించిన సేవలను గుర్తించాల్సిన ప్రభుత్వం, ఇప్పుడు తమకు ఇచ్చిన భూమికి సంబంధించిన న్యాయ ప్రక్రియల్లో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని వాపోయాడు. అందుకు సంబందించిన వివరాలు...

అనంతపురం పట్టణానికి చెందిన రాయచోటి గఫూర్ ఖాన్ 1941న భారత సైన్యంలో చేరారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో భారత్ తరపున పోరాడుతూ రష్యా, చైనాలతో సంబంధం ఉన్న యుద్ధ పరిణామాల్లో పాల్గొని సేవలు అందించారు. దేశానికి చేసిన సేవల నేపథ్యంలో ఆయనను ఒక క్రమశిక్షణ గల సైనికుడిగా గుర్తించారు. స్వాతంత్ర్యం అనంతరం 23 ఆగస్టు 1947న మద్రాసు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో చేరిన గఫూర్ ఖాన్, అక్కడ కూడా తన విధులను నిబద్ధతతో నిర్వహించారు. అనంతరం 1969లో అనంతపురం ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ)లో విధులు చేపట్టి, 1973లో అదే శాఖ నుంచి ఉద్యోగ విరమణ చేశారు. సైన్యం, పోలీస్, ఏసీబీ మూడు కీలక రంగాల్లో ఆయన సేవలందించారు. ఈ సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం అప్పట్లో శ్రీ సత్య సాయి జిల్లా ఎన్‌పీకుంట మండలం వెలిచెలమల గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 646 - 2లో ఐదు ఎకరాల భూమిని గఫూర్ ఖాన్‌కు కేటాయించింది. సుమారు 50 సంవత్సరాల క్రితమే ఆ భూమికి సంబంధించిన పట్టాను కూడా ప్రభుత్వం జారీ చేసింది.గఫూర్ ఖాన్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన ఆర్. మహమ్మద్ ఖాన్, చిన్న కుమారుడైన అన్సర్ అలీ ఖాన్‌కు వారసత్వంగా వచ్చిన ఆ ఐదు ఎకరాల భూమిని చెరి రెండున్నర ఎకరాల చొప్పున విభజించుకున్నారు. అందుకు సంబంధించి పాసుపుస్తకాలు కూడా జారీ అయ్యాయి. ఆర్. మహమ్మద్ ఖాన్ పేరిట 1581 నంబర్‌తో పాసుపుస్తకం ఉంది.

అయితే తన పేరిట ఉన్న భూమికి సంబంధించి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ అవసరం కావడంతో రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే, గత కొన్ని నెలలుగా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ ఎన్‌ఓసీ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని బాధితుడు వాపోతున్నారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నప్పటికీ, అనవసర కారణాలు చెబుతూ అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. దేశానికి సేవ చేసిన మాజీ సైనికుడి కుటుంబానికి ఇలా న్యాయం జరగకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని, రెవెన్యూ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి వెంటనే ఎన్‌ఓసీ మంజూరు చేయాలని బాధితుడు ఆర్. మహమ్మద్ ఖాన్ కోరుతున్నాడు. మాజీ సైనికుల కుటుంబాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, కనీసం చట్టబద్ధంగా తమకు దక్కాల్సిన హక్కులు అయినా కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గం : వైసిపి



జెండా ఊపి సంతకాల ప్రతులున్న వాహనాన్ని బయలుదేరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయం దుర్మార్గమైన చర్య అని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా సంతకాల సేకరణ పత్రాలను ఈనెల 18వ తేదీన రాష్ట్ర గవర్నర్‌కు సమర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీ సత్యసాయి జిల్లాకి సంబంధించిన లక్షలాది సంతకాల పత్రాలను జిల్లాలోని వైసీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో సోమవారం జిల్లాకేంద్రంలో భారీ వాహనాల ర్యాలీ నిర్వహించి సంతకాల పత్రాలను తరలింపు వాహనానికి జెండా ఊపి రాష్ట్ర కేంద్ర పార్టీ కార్యాలయానికి పంపారు. ఈ కార్యక్రమంలో ఉషశ్రీ చరణ్‌తో పాటు పుట్టపర్తి, కదిరి, రాప్తాడు, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల సమన్వయకర్తలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మక్బూల్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఈరలక్కప్ప, దీపిక, ధర్మవరం సమన్వయకర్త కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి కృష్ణారెడ్డి, హిందూపురం పార్లమెంట్ అబ్జర్వర్ రమేష్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , రాష్ట్ర అనుబంధ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ. ప్రజలు చేసిన ప్రతి సంతకం ప్రభుత్వానికి ఇచ్చే శక్తివంతమైన హెచ్చరిక అని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు పార్టీలకు అతీతంగా ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ప్రజల ఆరోగ్య హక్కు కోసం మెడికల్ కళాశాల నిర్మాణాలను జగన్ ప్రారంభిస్తే ప్రస్తుత ప్రభుత్వం కమీషన్ల కోసం ప్రైవేటీకరణలోకి నెట్టేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. ఇది పేద ప్రజల, విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రమైన దెబ్బ అని అన్నారు. జగనన్న హయాంలో ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం మొదలయ్యాయనివాటిలో 7 పూర్తవ్వగా, ఐదు కాలేజీల్లో అడ్మిషన్లు జరగగా, మిగతా కాలేజీల పనులు వివిధ దశల్లో ఉన్నప్పటికీ ఇప్పుడు పి పి పి పేరిట పది కొత్త కాలేజీలను ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలో మొత్తం 2450 ఎంబిబిఎస్ సీట్లు విద్యార్థులు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీ లతో ఏర్పడే నర్సింగ్, పారామెడికల్, వైద్య శిక్షణ సంస్థలు యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని ప్రతి ప్రాంత అభివృద్ధికి ఇవి మూలస్తంభాలు అవుతాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణను వెనక్కి తీసుకొని, నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలు అన్నిటిని పూర్తిచేసి ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు.

సిఐటియు అఖిలభారత మహాసభను విజయవంతం చేయండి

పుట్టపర్తిలో జెండా ఆవిష్కరణలో నాయకులు

ధర్మవరంలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

పెనుకొండలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఈనెల 31 నుండి జనవరి4వ తేదీ వరకు నిర్వహించనున్న సిఐటియు అఖిలభారత మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి కార్మిక, ఉద్యోగ, సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె సోమవారం శ్రీ సత్య సాయి జిల్లా కార్మిక కర్షక భవనం ముందు సిపిఎం జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎల్ నరసింహులు, కోశాధికారి లక్ష్మీనారాయణ ,ఆశ వర్కర్ల సంఘం గౌరవాధ్యక్షులు సాంబశివ, సిఐటియు మండల నాయకులు పై పల్లి గంగాధర్, ఆటో బాబా, నాగరాజు ,ముత్యాలు, ఆశా యునియన్ నాయకురాలు, సౌభాగ్య, రమాదేవి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరిని ఎండగట్టడానికి విశాఖపట్నంలో నిర్వహిస్తున్న అఖిల భారత సిఐటియు మహాసభలు వేదిక కానున్నాయని దీని ద్వారా ప్రభుత్వాలకి ఒక హెచ్చరిక జారీ చేయనున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గాల పట్ల అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక వర్గం ఏకతాటి పైకి వచ్చేందుకే ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని, ఆఖరు రోజు విశాఖపట్నం ఆర్కే బీచ్ లో లక్షలాదిమంది తో కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. అందులో కార్మికులు, ఉద్యోగస్తులు, స్కీం వర్కర్లు, వివిధ ప్రజా సంఘ నాయకులు కార్యకర్తలు పాల్గొనివిజయవంతం చేయాలని కోరారు. అంతేకాక మహాసభలు సందర్భంగా ప్రతి కార్మికుడు వారి ఇంటి పైన ఎర్రజెండా రెపరెపలాడే విధంగా ఆవిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం నాయకులు శోభ, మంజుల, సుశీల, భాను, ముంతాజ్, రాజేశ్వరి, చెన్నకృష్ణమ్మ, కాంతమ్మ, అంజనమ్మ, వెంకట లక్ష్మమ్మ, హనుమక్క ఆఫీస్ బ్యానర్ సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : విశాఖపట్నంలో ఈ నెల 31 నుండి జనవరి 4 వరకు జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభల సందర్భంగా సోమవారం పట్టణంలో మున్సిపల్ కార్యలయం ఎదుట, సివిల్ సప్లై గోడౌన్, టాటా ఏసీ గూడ్స్ స్టాండ్, పెనుగొండ రోడ్డు ఆటో స్టాండ్, కల్లూరు ఆటో స్టాండ్, మున్సిపల్ వర్కర్స్, డివిజన్ ఇందిరా పార్క్, 2వ డివిజన్ రైల్వే రోడ్డు, 3వ డివిజన్ చిన్న మార్కెట్, 4వ డివిజన్ నూతన మార్కెట్, 5వ డివిజన్ రైల్వే రోడ్డులో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి వి ఆర్ రాము, మునిసిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మురళి, సహాయ కార్యదర్శి మంజు, ఉపాధ్యక్షులు రామాంజనప్ప, చంద్ర, నరసింహా, మూర్తి, మహిళా నాయకురాలు మహేశ్వరమ్మ, గంగరత్న, సివిల్ సప్లైయి అమాలిస్ యూనియన్ నాయకులు మూర్తి, మురళి, వెంకటేష్, మునిరాజ్, గోపి, అరుణ్, ఆటో యూనియన్ నాయకులు అంజి, నరసప్ప, బాబా, సంజీవ, గంగాధర, హరి, నాగేష్, రమేష్, అంజి, టాటా గూడ్స్ యూనియన్ మోహన్, రాము, శ్రీధర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభల సందర్భంగా సోమవారం సివిల్ సప్లై హమాలీ గోడౌను,సిఐటియు, మున్సిపాలిటీ కార్యాలయాల వద్ద సిఐటియు జెండా ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ వైజాగ్ లో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బాబావలి,భావమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, సివిల్ సప్లై యూనియన్ సలీం వలి, హనుమంతు, సుధాకర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వెంకటేష్, నరసింహ ప్రసాద్, జబ్బర్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సావిత్రమ్మ భవన నిర్మాణ కార్మిక సంఘం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి :మండలం పరిధిలో ని కంచిసముద్రం, లేపాక్షి గ్రామాలలో సోమవారం సీఐటీయూ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కృష్ణమూర్తి, ధనమ్మ, భాగ్యమ్మ, ప్రేమావతి,తదితరులు పాల్గొన్నారు

కొత్తచెరువు : ఈ నెల 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే సిఐటియు 18వ అఖిలభారత మహాసభల నేపథ్యంలో కొత్త చెరువులో సిఐటియు నాయకులు ఎర్రజెండాను సోమవారం ఎగురు వేశారు ఈ సందర్భంగా మండల కార్యదర్శి ముత్యాలు, మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు ,షేక్ అజం, నాగభూషణ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : ఈనెల 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నం వేదికగా జరిగే సిఐటియు 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా సోమవారం మండలంలోని సుందరయ్య కాలనీలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు వివి రమణ, రైతు సంఘం రామిరెడ్డి, సిపిఎం మండల కన్వీనర్ కుల్లాయప్ప, కాంతమ్మ ,అంజి ,తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : సిఐటియు 18వ అఖిల భారత మహాసభల నేపథ్యంలో మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ, పంచాయతీ, ఆటో కార్మిక సంఘాల చెందిన నాయకులు, కార్యకర్తలు సిఐటియు జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమావరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్ కుమార్, అంగన్వాడి వర్కర్స్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి శోభారాణి, శారద, శాహేర. పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు గౌస్ లాజం, రఫీక్, చలపతి, హనుమంతప్ప, ఆదినారాయణప్ప, తిప్పన్న, ఆటో యూనియన్ నాయకులు మురళి, కలీం తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : సిఐటియు ఆల్ ఇండియా మహాసభల నేపథ్యంలో సోమవారం పట్టణం లోని స్థానిక ఎన్టీఆర్ కూడలి సిఐటియు స్తూపం వద్ద జెండా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు నాయకులు ఎస్‌హెచ్. బాషా, నాయకులు శేషంపల్లి మారుతి, జేవి రమణ. ఎల్ ఆదినారాయణ,ఆటో యూనియన్ పట్టణ నాయకులు ఎస్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : సిఐటియు జాతీయ మహాసభల నేపథ్యంలో మండలంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బాబ్జాన్, నాయకులుశ్రీరామ్ రెడ్డి, టైలర్ ముస్తఫా, బండల వెంకటేశు, పోతులయ్య, ఆవాజ్ నాయకులు నౌషాద్ అల్లా బకాష్, రిక్షా ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బుక్కపట్నం

స్థానిక ఆర్‌టిఎ కార్యాలయం ఎదురుగా సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. బుక్కపట్నం ముదిగుబ్బ ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న వస్తున్న ద్విచక్ర వాహనాన్ని మరొక ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో నేలకోటప్ప (69) మృతిచెందాడు, సిద్ధారాంపురం గ్రామానికి చెందిన సర్పంచి వెంకటరమణయ్య, నేలకోటప్ప స్కూటీ వాహనంలో పుట్టపర్తికి వెళుతుండగా, కొత్తచెరువు నుంచి ముదిగుబ్బకు పల్సర్ బైక్‌లో వెళుతున్న తలుపుల మండలం చెందిన మల్లికార్జున ఎదురుగా వచ్చి వీరి స్కూటీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నేలకోటప్ప, వెంకటరమణయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన నేలకోటప్పను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా ధర్మవరం సమీపంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. మృతునికుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

అభ్యంతరకర పోస్టులపై కేసు

ప్రజాశక్తి గాడ్లపెంట

మండల పరిధిలోని చామాలగొంది పంచాయతీలోని భయ్యా రెడ్డి పల్లికి చెందిన హరి నాయుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాళ్లకు మొక్కినట్లు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ విషయంపై కదిరికి చెందిన జనసేన అధ్యక్షుడు కిల్లి రమేష్ కావడంతో సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు జమేదార్ గంగాధర్ తెలిపారు. ఈ మేరకు సిఐ నాగేంద్ర విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

దుకాణాలపై మున్సిపల్ సిబ్బంది దాడులు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని దుకాణాలపై మున్సిపల్ సిబ్బంది సోమవారం దాడులు చేశారు. 90 కేజీల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు దుకాణాలు హోటళ్లపై దాడులు చేశామన్నారు. ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసి రూ.1500 అపరాధ రుసుము విధించామని ఆయన తెలిపారు. ఇలాంటివి పునరావృతమైతే దుకాణాల ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈసందర్భంగా ఫిర్యాదుదారుల నుండి వచ్చిన 80 అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలపై జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదులకు చట్ట పరిధిలో తక్షణ చర్యలు తీసుకొని న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు, అడిషనల్ ఎస్పీ అంకిత సురాన , లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ఎస్ సి.ఎస్ టి సెల్ సిఐ ఇస్మాయిల్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి సైనికుల్లా పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి అర్బన్

పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుల్లా పనిచేయాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళగిరి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరుగుతున్న మండల, నియోజకవర్గ స్థాయి నేతల శిక్షణ తరగతులలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని మాట్లాడారు. పార్టీ ప్రతిష్ట పెంపొందించే విధంగా చేయాల్సిన అంశాలను వివరించారు. పార్టీ సంస్థాగత, విధులు అంశం మీద శిక్షణ ఇచ్చారు.

జిల్లాస్థాయి పోటీలకు గోరంట్ల టీచర్స్ జట్టు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలకేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న పుట్టపర్తి డివిజన్ టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో గోరంట్ల టీచర్స్ జట్టు ప్రతిభ కనపర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. సోమవారం జరిగిన డివిజన్ ఆఖరి పోటీలలో బుక్కపట్నం జట్టుపై గోరంట్ల జట్టు విజయం సాధించడంతో ఆ జట్టు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. గెలుపొందిన జట్టుకు ఎంఇఒ సోమశేఖర్ హెచ్ఎం గోపాల్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు వెంకటేష్, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల విభజనపై నేడు గ్రామసభ

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని వేపమాని పేట గ్రామపంచాయతీ విభజనపై గంజివారిపల్లి గ్రామంలోని ఆర్డీటీ కమ్యూనిటీ హాల్ వద్ద గ్రామసభను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నసీమా తెలిపారు. గంజివారిపల్లి, గంజివారిపల్లి ఎస్సీ కాలనీ, బోయపల్లి, గుర్రంగుండ్లపల్లి, కొత్త పూల వాండ్లపల్లి, కొత్తపూల వాండ్లపల్లి ఎస్సీ కాలనీ తో పాటు గ్రామపంచాయతీ ప్రజలందరూ పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. గ్రామసభ తీర్మానాలను జిల్లా పంచాయతీ అధికారికి పంపనున్నట్లు ఎంపీడీవో వివరించారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలో గోపి దేవరపల్లిలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద నాలుగు లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి భూమి పూజ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మల శ్రీధర్, సుధాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో సర్వే నెంబర్ 29-2సిలో రైతు బయపరెడ్డి పొలంలో సాగుచేసిన వరి పొలంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, విహెచ్ఎ సత్యనారాయణ, ఇన్సూరెన్స్ అధికారి చాంద్‌బాషా రైతులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఖాద్రి లక్ష్మీనరసింహస్వామినీ ఏపీ హైకోర్టు న్యాయమూర్తి కుంచెం మహేశ్వర రావు సోమవారం దర్శించుకున్నారు. న్యాయమూర్తి కి ఆలయ ప్రధాన ద్వారం వద్ద అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయలక్ష్మి, పట్టణ సీఐ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని తారకరామాపురం గల ఆర్డీటీ క్రికెట్ మైదానంలో సోమవారం క్రికెట్ క్రీడాకారులకు టీ షర్టులను వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు వెంకటేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలో మంచి ప్రావీణ్యం సంపాదించి, క్రమశిక్షణతో పేరు ప్రతిష్టలు సంపాదించుకొని, తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు శేషాద్రి రెడ్డి, ఉపాధ్యక్షులు గుండ్లపల్లి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మెడల్‌పేపర్లు అందజేత

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మడకశిర గుడిబండ జ్యోతిబాయి పూలే పాఠశాల విద్యార్థులు యుటిఎఫ్ నాయకులు మాదిరి ప్రశ్నాపత్రాలను ప్రిన్సిపాల్ వరలక్ష్మి సమక్షంలో అందజేశారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శి డి నరసింహప్ప మాట్లాడుతూ సి డి గ్రేడ్ విద్యార్థులను పూర్తిస్థాయిలో ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రశ్న పత్రాలను తయారు చేసి అందజేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల గౌరవ అధక్షులు నరసింహమూర్తి, మండల అధక్షులు మహాలింగప్ప, ప్రధాన కార్యదర్శి జోగప్ప, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డి పల్లి ప్రాథమికోన్నత పాఠశాల కు బాలాజీ సప్లయర్ అధినేత ఎం.గంగాధర్ అహుజ కంపెనీకి చెందిన మైక్ సెట్, మౌత్ పీస్‌ను సోమవారం ప్రధానోపాధ్యాయుడు నారాయణ స్వామికి అందచేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నారాయణ స్వామి మాట్లాడుతూ గంగాధర్ సొంత ఖర్చులతో మైక్ సెట్ మౌత్ పీస్ ను అందజేయడం అభినందనీయమన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - తలుపుల

మండలంలో నివసిస్తున్న వయసు పైబడిన వారికి, వికలాంగులకు, పిల్లలకు రూలర్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ మన్సూర్ మాట్లాడుతూ చలి తీవ్రత ఎక్కువ అవ్వడంతో పేద ప్రజలు ఇబ్బంది పడకూడదని దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేదిక్ డాక్టర్ లక్ష్మీ నరసయ్య , సూపర్వైజర్ రామ్మోహన్ , అరుణ, డాక్టర్ దినకర్, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే 'కూటమి' లక్ష్యం

ప్రజాశక్తి బుక్కపట్నం

రైతులకు యూరియా అందజేస్తున్న నాయకులు

కూటమి ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం సాధ్యమని రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ యూరియాను పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం సాధ్యమని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు సంజీవ రాయుడు, సీఈవో ప్రసాద్ రెడ్డి, జనసేన కన్వీనర్ దాసరి శ్రీనివాసులు, జనసేన యువనేత తోట అనిల్ కుమార్, సయ్యద్ బాషా, సంకు మహేష్, గణేష్ రైతులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

పట్టణంలోని కొత్తపేట గీతా మందిరం సమీపంలో నివసిస్తున్న చేనేత కార్మికుడు లక్ష్మీనారాయణ అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు, 30వ వార్డు ఇన్‌ఛార్జి కోటిరెడ్డి రాజారెడ్డి మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన వంతుగా ఐదు వేలరూపాయలను కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు అడ్డగిరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో 'పురం' వాసుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల బాపట్ల ఆర్ట్స్ కళాశాలలో మైదానంలో నిర్వహించిన ఏడవ ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీల్లో హిందూపురం పట్టణానికి క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, రజత పతకాలను కైవసం చేసుకున్నారు. హిందూపురం పట్టణానికి చెందిన చెందిన విశ్రాంత డి.ఎస్.పి.వి.వి గిరిధర్, మలుగూరు జడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ రమేష్ పాల్గొని ప్రతిభ చూపారు. నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ మాస్టర్ అసోసియేషన్ ఈ పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. 60 ఏళ్ల పైబడిన షాట్ పుట్, డిస్క్ త్రో విభాగంలో గిరిధర్ ప్రతిభ చూపి రెండు బంగారు పతాకాలు సాధించగ హేమర్ త్రో బాల్ లో ప్రతిభ చూపి వెండి పతకం సాధించారు. అదే విధంగా 55 ఏళ్ల పైబడిన గ్రూపు విభాగంలో షాట్ పుట్, డిస్క్ త్రో లో ఎన్.రమేష్ రెండు వెండి పతకాలను, జావెలిన్ త్రో విభాగంలో రజత పతకం ం సాధించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వీరందరు వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ నుండి మూడు రోజుల పాటు రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ లో జరిగే నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటున్నారు. హిందూపురం పట్టణానికి చెందిన ఇరువురు జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక కావడం

విక్టరీ గుర్తు చూపుతున్న రిటైర్డ్ డిఎస్‌పి గిరిధర్

పట్ల స్థానిక క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

IN THE COURT OF THE HONARBLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADIRI

O.S.No: 869/2023

Between:

ఎన్.లక్ష్మినారాయణ ...వాది

మరియు

చింత శ్రీనివాసులు ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

To,

చింతా శ్రీనివాసులు S/o కే.శే.నారాయణ, Door No.1-1189-1A, NGO కాలనీ, కదిరి కి చెందిన నీపైన పై కోర్టు నందు, వాది ఎన్.లక్ష్మినారాయణ వేసిన దావాలో నీ హాజరు నిమిత్తమై 29/12/2025 వ తేది ఉదయం 10.30 గంటలకు వాయిదా ఉన్నది. కావున నీవు స్వయంగా కానీ, న్యాయవాది ద్వారా కానీ పై కోర్టు ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని ఎడల పై దావాను మీ పరోక్ష మున తీర్మానం చేయబడునని తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:29-12-2025

కె.యస్.ప్రభాకర్ రెడ్డి,
వాది తరుపు న్యాయవాది, కదిరి.
9440284836

మహారాజ శ్రీ ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి

E.A. No: 74/2023 in EP 43/2023 in O.S.No:375/2011

Between:

కోల్‌కర్ ఖమ్మన్నీ సా Died by LRs 2 to 6 ...పిటీషనర్స్- డిక్రీహోల్డర్స్

మరియు

వూట్ల వెంకటసుబ్బయ్య (Died by LRs) మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్-జడ్జిమెంట్‌డెటార్స్

To,

R12: దాసరి వెంకటేష్ చంద్రశేఖర్ S/o పెద్ద వెంకటేష్ D.No: 4-4/3, Ist Floor, Sidda Enclave, మెయిన్ రోడ్డు, నెహ్రూనగర్, శేషాద్రిపురం, బెంగళూరు-20.

R13: దాసరి చంద్రశేఖర్ నాగమణి @ D.C. నాగమణి W/o దాసరి వెంకటేష్ చంద్రశేఖర్ D.No: 4-4/3, Ist Floor, Sidda Enclave, మెయిన్ రోడ్డు, నెహ్రూనగర్, శేషాద్రిపురం, బెంగళూరు-20.

12 మరియు 13వ రెస్పాండెంట్స్ నోటీసులు

పై అర్జీలోని పిటీషనర్స్ డిక్రీహోల్డర్స్ దావాలో పొందిన డిక్రి మేరకు అమలు అర్జీలో కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేసి నందుకు పిటిషనర్స్ డిక్రీహోల్డర్స్ E.P షెడ్యూలు దాఖల ఆస్తిలోనికి ప్రవేశించడానికి మీరు ఆటుంకము కలుగజేయుచున్నందున్న మీ మీద పిటిషనర్స్ డిక్రీహోల్డర్స్ పోలీసు రక్షణ కల్పించాలని కోర్టులో పై అర్జీ వేసివున్నారు. సదరు అర్జీ మీ హాజరు నిమిత్తమై 09-01-2026వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు, మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై అక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెనని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 9-01-2026

స్థలం:కదిరి ఇట్లు

శ్రీ.ఎ.పి.సిద్ధార్థ సాయికుమార్, బి.ఎ., ఎల్.ఎల్.బి,
శ్రీ.కె.నరేంద్ర, బి.బి.ఎ., ఎల్.ఎల్.బి,
పిటీషనర్స్ తరపు వకీలు, కదిరి

PUBLIC NOTICE

My clients 1) **Smt.DEEPA. K.G,** W/o Anantha.L.N 2) **Smt.PUJA.S,** W/o Sri.Sathya pramod. B.S & 3) **Sri.SATHYAPRAMOD.B.S,** S/o B.Sreenivas Achar 4) **Sri.Vikram Gururaj,** S/o Sri.S.Gururaj are intending to purchase the schedule property from its owner M/s Sai Properties & Projects Ltd., for a valid sale consideration. If any persons having any claims, right, title, interest, whatsoever over the schedule property may forward their objections to the under mentioned address in writing, within 7 days from the date of this notice, failing which it will be deemed that there are no claims, right, title or interest by anybody and my client will proceed with the completion of sale transaction and will get register the absolute sale deed of the schedule property in his name.

SCHEDULE PROPERTY

1. All that piece and parcel of agricultural property to an extent of 50 cents in Survey No. 308-1A/1A1, marked as Plot Nos.28-A & 28-B, situated at Maddalacheruvu Village, CK Palli (SRO), Kanaganapalle Mandal of Sri Satya Sai District, Andhra Pradesh and bounded on;
East by : Cart Road,
West by : Remaining land of SPP Estates and Projects Pvt. Ltd.,
North by : Remaining land of SPP Estates and Projects Pvt. Ltd.,
South by : Remaining land of SPP Estates and Projects Pvt. Ltd.,

2. All that piece and parcel of agricultural property to an extent of 50 cents in Survey No. 308-1A/1A1, marked as Plot No.12-A & 12-B, situated at Maddalacheruvu Village, CK Palli (SRO), Kanaganapalle Mandal of Sri Satya Sai District, Andhra Pradesh and bounded on;
East by : Remaining portion of Plot No.12 of SPP Estates and Projects Pvt. Ltd,
West by : Road,
North by : Remaining land of SPP Estates and Projects Pvt. Ltd.,
South by : Remaining land of SPP Estates and Projects Pvt. Ltd.,

Bengaluru
12-12-2025

V.N.SIMHA.,
B.Sc.,M.A.,LL.B
Advocate,
No.38/15, WAT Street,
Bengaluru-560 004.
Basavanagudi,
Mobile 9845549487

రహదారి సమస్యలపై ఆర్‌డిఒకు వినతి

సమస్యను వివరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం డివిజన్ లో ఉన్న రైతుల భూములకు సంబందిచి రహదారి సమస్యలపై ఏ పి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ఎస్ ఎచ్ బాషా, మహాదేవ ఆధ్వర్యంలో సోమవారం ధర్మవరం ఆర్ డి ఓ మహేష్ కి వినతి పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరం డివిజన్ లోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, కనగానపల్లి, రామగిరి, సి కే పల్లి మండలాల్లో రైతులకు తమ పొలాల్లో కి పోవడానికి రస్తాలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులకి ఇబ్బంది లేకుండా రస్తాని చూపాలని కోరారు. ఈ కార్యక్రమం లో రైతు సంఘం నాయకులు మలక వేముల ఖాదర్ వలి, ఆలకుంట మారుతీ, పి, నారాయణ, సిఐటియు నాయకులు ఆదినారాయణ, అయూబ్ ఖాన్, రమణ, పరంధామ, రైతులు చంద్ర, రామకృష్ణ, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కోసం రెండు కిలోమీటర్ల నడక

ప్రజాశక్తి - చిలమత్తూరు

తమ రేషన్ కార్డులు దేమకేతేపల్లి ఎస్సీ కాలనీ రేషన్ స్టోర్‌కు అనుసంధానమై ఉండటంతో ప్రతి నెలా సుమారు రెండు కిలోమీటర్లకు పైగా దూరం నడిచి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తోందని మండల పరిధిలోని గాద్రాళ్లపల్లివాసులు వాపోతున్నారు. గత ఏడు సంవత్సరాలుగా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నామని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దినసరి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు తహశీల్దార్ కార్యాలయంలో అర్జీలు సమర్పించినప్పటికీ సమస్యకు ఇప్పటివరకు పరిష్కారం కనిపించడం లేదని వాపోయారు. గాద్రాళ్లపల్లికి సమీపంలోనే ఉన్న రేషన్ షాప్‌కు తమ రేషన్ కార్డులను బదిలీ చేయాలని కోరారు. తమ సమస్యపై అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకొని న్యాయం చేయాలని గాద్రాళ్లపల్లివాసులు కోరారు. అనంతరం డిప్యూటీ తాహశీల్దార్ జగన్నాథ్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై సీఎస్డిటి శ్రీధర్‌ను వివరణ కోరగా, రేషన్ కార్డులను మరో రేషన్ షాప్‌కు బదిలీ చేయాలంటే సివిల్ సప్లై కమిషనర్ స్థాయిలో ఉన్న లాక్ ఓపెన్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ లాక్ ఓపెన్ అయితేనే కార్డుల బదిలీకి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కదిరి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

అనంతపురం నగరంలో ఆదివారం జరిగిన 5వ రాష్ట్రస్థాయి డాన్స్ స్పోర్ట్ చాంపియన్షిప్ - 2025 పోటీలలో కదిరి విద్యార్థి సత్తా చాటాడు. జూనియర్స్ కేటగిరీ లో డ్యూయెట్ విభాగంలో కదిరి బ్లూమూన్ స్కూల్ లో తొమ్మిదవ తరగతి చదువుతున్న రోషన్ ప్రథమ స్థానంలో బంగారు పతకాన్ని సాధించినట్లు బ్లూమూన్ విద్యా సంస్థల చైర్మన్ మంచి శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా శివ శంకర్ మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా రోషన్‌ను స్కూల్ చైర్మన్ మంచి శివ శంకర్, హెచ్ఎంలు మాధవరెడ్డి, సురేందర్ రెడ్డి అభినందించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన త్యాగమూర్తి శ్రీ పొట్టి శ్రీరాములు అని ఆయన ఆశయాలు, ఆదర్శాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అన్నారు.సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్‌తో కలిసి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చూపిన అచంచల దీక్ష, స్వార్థరహిత త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆయన జీవితం ప్రజాసేవకు అంకితమైందని, ప్రజల హక్కుల సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని మహనీయుడని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు పొట్టి శ్రీరాములు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల తహశీల్దార్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న అధికారులు

సోమందేపల్లి : తెలుగు రాష్ట్ర సాధకుడు అమరజీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని సోమవారం ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రేమ్ కుమార్, రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ,రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ డి.వి.ఆంజనేయులు,టీడీపీ మండల కన్వీనర్ నడిమిపల్లి వెంకటేష్, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, మాజీ కన్వీనర్ సిద్ధలింగప్ప,ఫైవ్ మ్యాన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నంబుల పూలకుంట : పొట్టిశ్రీరాములు ఆదర్శనీయుడని మాధవరెడ్డి పేర్కొన్నారు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దేవదర్శన్ రెడ్డి, ఏపీవో శ్రీధర్ రెడ్డి, ఉపాధి సిబ్బంది

బత్తలపల్లి : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని సోమవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహనాయుడు, ఉప ఎంపీడీవో క్రిష్టప్ప, జిఎస్ డబ్ల్యూఎస్ అధికారి రామ్మోహన్ నాయుడు, ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి అశోక్, కార్యాలయ సిబ్బంది ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్ల : పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి ఎంపీడీవో కమలాబాయి, ఉపాధి సిబ్బంది నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. తహశీల్దార్ షేక్షావలి రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించారు.

పట్టాదారు పాసు పుస్తకాల కోసం వినతులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో వసంతబాబు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. అందులో కుందుర్పి, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప, కళ్యాణదుర్గం మండలాల రైతులు పట్టాదారు పాసుపుస్తకాల కోసం మొరపెట్టుకున్నారు. కణేకల్లు మండలంలో పంచాయతీ సమస్య, కంబదూరు మండలంలో పింఛన్లు, కళ్యాణదుర్గం మండలం ఇందిరమ్మ కాలనీలో దేవాదాయ శాఖకు సంబంధించిన సమస్యలపై వినతులు అందాయి. 11 మండలాల ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. వీటిపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆర్డీవో తక్షణమే వాటిని పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు.

ఆర్డీవోతో మాట్లాడుతున్న రైతులు

బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని న్యాయస్థానాల ఆవరణలో సోమవారం ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో న్యాయవాదులు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల బరిలో నిలిచిన సత్తు అంకయ్య తరపున వారు ప్రచారం చేపట్టారు. జూనియర్ న్యాయవాదులకు ఉపకార వేతనం రూ. 10వేలు ఇచ్చేలా, న్యాయవాదులు, మహిళా న్యాయవాదుల కోసం మౌలిక సదుపాయాల సాధన కోసం అంకయ్య పోరాడుతారన్నారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరుయాదవ్, సతీష్, న్యాయ వాదులు శ్రీనివాసులు, రమేష్, సురేంద్ర, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న వైద్యాధికారి తెహరున్నీసా

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సమిష్టి కృషితో విజయ వంతం చేద్దామని పిహెచ్‌సిల వైద్యాధికారులు సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై సోమ వారం పలు పిహెచ్‌సిల్లో మండల స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించారు. స్థానిక పిహె చ్‌సి, స్త్రీ శక్తి భవనంలో పల్స్ పోలియోపై సమావేశం నిర్వహించారు. మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ మాట్లాడుతూ పల్స్‌పోలియోకు రెండు రోజుల ముందు ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని, దండోరా వేయించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహశీల్దార్ సుమతి, ఎంఇఒ ఓబుళపతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు కాశీంబి, రామాంజినమ్మ, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బెళుగుప్ప: చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ రుషికుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియోపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిపి పెద్దన్న, ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ, టిడిపి నాయకుడు మల్లికార్జున హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, సూపర్వైజర్ వెంకటరమణ, సరోజ, ఎఎన్ఎంలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులదరికీ పోలియో చుక్కలు వేయించి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డి.హీరేహాల్ వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ కోరారు. పల్స్‌పోలియోపై స్థానిక పిహెచ్‌సిలో వైద్య ఆరోగ్య శాఖ, అంగన్వాడీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ 3 రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ రజిని, డాక్టర్ జస్వంత్, అంగనవాడీ సూపర్వైజర్ ఉమారాణి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : పల్స్ పోలియోపై స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ తెహరున్నీసా ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 0–5 ఏళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ మోహన్‌రావు, పిహెచ్ఎన్ సుజాత, సూపర్‌వైజర్స్ విజయలక్ష్మి, సత్యనారాయణశాస్త్రి, జానీరాజ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం గ్రామం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి మెకానికల్ ఇంజినీ రింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థులు విద్యుత్ ఉత్పత్తి, సాంకేతికతపై అవగాహన పొందేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇందులో భాగంగా రామగిరి మండలంలో సోలార్ పవర్ ప్రాజెక్ట్, గన్సన్ గ్లోబల్ సొల్యూషన్స్, విండ్ టర్బైన్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. సోలార్ ప్యానెల్స్, ఇన్వర్టర్ స్టేషన్లు, సోలార్ ట్రాకింగ్ సిస్టమ్స్, గ్రిడ్‌కు విద్యుత్ అనుసంధాన ప్రక్రియ, విద్యుత్ పంపిణీ, ప్లాంట్ నిర్వహణ, తదితర అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. విండ్ ఎనర్జీ ఉత్పత్తికి అవసరమైన గాలి వనరుల అంచనా, టవర్ డిజైన్, నిర్వహణ విధానాలపై విద్యార్థులకు నిపుణులు అవగాహన కల్పించారు. వారి తో పాటు కళాశాల ప్రిన్సిపల్ డా. జి.బాలకృష్ణ, మెకానికల్ విభాగాధిపతి డా. డి.సాయి చైతన్య కిశోర్, పరిశ్రమల సందర్శన సమన్వయకర్త సిహెచ్.జోసెఫ్‌సుందర్ ఉన్నారు. ఆయా సంస్థలకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

డి.హిరేహాల్‌లో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రావణ్‌కుమార్

చేనేత కార్మికులకు ముద్ర రుణాలు అందించాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

చేనేత కార్మికులకు నేతన్న నేస్తం తో పాటు ముద్ర రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం మండల కమిటీ అధ్యక్షులు మాబు ఆధ్వర్యంలో చేనేతలు సోమవారం డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి కార్మికుల వ్యక్తిగత వివరాలతో అవసరమైన పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష కార్యదర్శులు మాబు జింక నాగరాజు మాట్లాడుతూ చేనేత కార్మికులు గత రెండు సంవత్సరాల నుండి నేతన్న నేస్తం పొందలేదన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా చేనేత కార్మికులకు ఇస్తామన్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలుకు నోచుకోలేదన్నారు. అర్హులైన చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ముద్ర రుణాలు అందలేదని బ్యాంకు అధికారులు ముద్రా రుణాల పంపిణీలో పారదర్శకత పాటించకుండా రాజకీయ ఆర్థిక సామాజిక పలుకుబడి కలిగిన వాళ్లకు మాత్రమే రుణాలు ఇస్తున్నారని విమర్శించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం మండల నాయకులు సుధాకర్ , షబ్బీర్, శ్రీనివాస్, బాబాజాన్ , ఈడిగ నాగేష్ , రియాజ్ , నరసింహులు , ఆంజనేయులు , రామాంజినప్ప , గౌరమ్మ , జయమ్మ , నాగభూషణం , ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని సిపిఐ నాయకులు చలపతినాయుడు డిమాండ్ చేశారు. ఈసందర్బ:గా ఆయన మాట్లాడుతూ రైతులకు గతంలో ఇచ్చిన భూములకు డి పట్టా అని కార్డులో ఉన్నందున ప్రభుత్వ నుండి వచ్చే సీఎం కిసాన్ రైతు సుఖీభవ చాలామందికి వర్తించలేదన్నారు. ప్రభుత్వం నుండి అందాల్సిన సహాయాన్ని పెండింగులో ఉన్న రైతులందరికీ అందించి న్యాయం చేయాలన్నారు. మండలంలోని వడ్డీ వారి పల్లి నుండి ఓడిసి వరకు ఉన్న రోడ్డు గుంతల మయంగా మారిందని ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టి నివారణ చేపట్టాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి కుమార్, రామచంద్ర, రత్న బాయ్, దేవేంద్ర, వీరప్ప, వెంకట్ రమణ,తదితరులు పాల్గొన్నారు.

చిన్న వెంకటేష్‌కు 'అంబేద్కర్' అవార్డు

ప్రజాశక్తి-గుత్తి

మాల మహానాడు నాయకుడు చిన్న వెంకటేష్‌కు డాక్టర్ అంబేద్కర్ విశిష్ట సేవారత్న అవార్డు ప్రదానం చేశారు. గుంటూరులో మాల మహాసభ, మాల మహానాడు సంయుక్త ఆధ్వర్యంలో మాలల ఆత్మీయ కలయిక నిర్వహించారు. అందులో రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది నాయకులకు డాక్టర్ అంబేద్కర్ విశిష్ట సేవారత్న అవార్డులు ప్రదానం చేశారు. అందులో భాగంగా పట్టణంలోని పైమాల వీధికి చెందిన చిన్న వెంకటేష్‌ను శాలువాతో సత్కరించి అవార్డు అందజేశారు. మాల సామాజిక వర్గం ప్రజల అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని గుర్తించి అవార్డును ప్రదానం చేశారని గ్రహీత చిన్న వెంకటేష్ తెలిపారు. మాలల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటాలు చేస్తామన్నారు.

ఘనంగా కేంద్రీయ విద్యాలయం వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కెవిఎస్)లో సోమవారం 63వ వార్షికోత్స వాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఎస్కెయు భూగోళ శాస్త్రం విభాగాధ్యక్షురాలు ప్రొఫెసర్ ఎ.కృష్ణ కుమారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రమశిక్షణ, అంకితభావం, కష్టపడి పని చేయడం, సానుకూల ఆలోచన, లక్ష్యసాధన వంటి అంశాలపై దృష్టి సారిస్తే ఎందులోనైనా విజయం సాధించ వచ్చన్నారు. కెవిఎస్ విద్యా ప్రమాణాలు, సమగ్ర విద్యాభివృద్ధి, జాతీయ సమైక్యత లక్ష్యంగా పని చేస్తుందన్నారు. కెవిఎస్ ఆశయాలను కొనసాగించేందుకు పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు కె.సుబ్రహ్మణ్యం, రాఘవేంద్ర ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

అందరి సహకారంతో ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీ నాయకులతో పాటు ప్రజాసంఘాల నాయకులతో కలిసి జిల్లా కేంద్రం సాధన కోసం ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని జిల్లా సాధన సమితి అధ్యక్షులు ఇందాద్, కార్యదర్శి శ్రీరాములు పేర్కొన్నారు. న్యాయవాది ఇందాద్ కార్యాలయంలో జిల్లా సాధన సమితి నాయకులు సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందూపురం పట్టణ కేంద్రంగా జిల్లాను ప్రకటించాలన్న డిమాండ్‌తో ప్రతి ఒక్కరూ కదలాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను జిల్లా కేంద్రం సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాబావలి, నూర్ మొహమ్మద్, ఉమర్ షారుఖ్ ఖాన్, జమీల్, కదిరిష్, నరసింహమూర్తి, సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

హెలీక్యాప్టర్ ల్యాండింగ్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి మడకశిర టౌన్

టైమ్ డొమైన్ విద్యుదయస్కాంత, అయస్కాంత భౌగోళిక సర్వేలను హెలికాప్టర్ ద్వారా నిర్వహించడం కోసం స్థానిక అధికారులు సోమవారం స్థల పరిశీలన చేశారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు చొరవతో సర్వే చేపట్టనున్నారు. హెలికాప్టర్ రిజిస్ట్రేషన్ నంబర్ వి.టి. బి ఆర్.ఆర్ హెచ్. తో పాటు, టైప్ హెచ్.125 కలిగిన హెలికాప్టర్ కోసం ఆపరేషన్ అనుమతి, ల్యాండింగ్, టేకాఫ్, పార్కింగ్, అనుమతిని అందించాలని స్థానిక అధికారులకు భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ నుండి ఆదేశాలు అందాయి. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, రిమోట్ సెన్సింగ్ మరియు ఏరియల్ సర్వేస్, భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి పైలెట్ ప్రాజెక్ట్ కింద కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో గుర్తించబడిన ఖనిజ సంభావ్య ప్రాంతాలపై టైమ్ డొమైన్ ఎలక్ట్రోమాగ్నెటిక్ (ఐ.డి.ఇ.ఎం), అయస్కాంత డేటాను పొందేందుకు హెలిబోర్న్ సర్వేలను నిర్వహిస్తోంది. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో అవుట్‌సోర్స్ ఏజెన్సీ ద్వారా హెలిబోర్న్ సర్వే నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్య సాయి జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో హెలిబోర్న్ సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో గుర్తించబడిన సంభావ్య ప్రాంతాలలో సర్వే నిర్వహించనున్నారు. ప్రస్తుతం కల్లుమరి ఉన్నత పాఠశాల ఆవరణంలో హెలికాప్టర్ ల్యాండింగ్స్ స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, డీఈ లక్ష్మీనారాయణ, నాయకులు కల్లుమర్రి నాగరాజు, డీలర్ మధుసూదన్, అగ్రంపల్లి మారుతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

రహదారి నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో నూతన రహదారి నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పావులూరు శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, బాలాజీ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సోమవారం భూమిపూజ చేశారు. పట్టణంలోని హోండా షో రూం ప్రక్కన ఉన్న నిర్మాణానికి రూ.92.50 కోట్ల నిధులతో తయారు చేయగా కౌన్సిల్ ఆమోదం మేరకు రహదారి నిర్మాణానికి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన జట్లు ఉత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలవాలని ఎంఇఒలు గంగప్ప, ప్రసన్న లక్ష్మి ఆకాంక్షించారు. హిందూపురానికి చెందిన ఉపాధ్యాయుల జట్లు క్రికెట్ పోటీల్లోనూ, మహిళా ఉపాధ్యాయుల త్రోబాల్ జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. దీంతో ఆయా జట్లకు ఎంఇఒలు తమ సొంత నిధులతో సోమవారం క్రీడా దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ స్థాపన దినోత్సవం

ప్రజాశక్తి-గోరంట్ల

స్థానిక పాల సముద్రంలో గల నాసిన్ అకాడమీలో ఏర్పాటుచేసిన కేంద్రీయ పాఠశాలలో సోమవారం కేంద్రీయ విద్యాలయ స్థాపన దినోత్సవాన్ని కేంద్రీయ పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాసిన్ సంస్థ సూపరింటెండెంట్ శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలల విద్యార్థికి మానసిక నైతిక శారీరక విలువలతో కూడిన విద్య అందించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. కేంద్రీయ విద్యాలయ విద్యార్థి దేశంలోనే కాక ప్రపంచంలో ఎక్కడైనా ఆత్మ ధైర్యంతో జీవించే శక్తిని కలిగి ఉంటాడని, ప్రతి విద్యార్థికి ప్రత్యేక శ్రద్ధతో విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం మొదటిగా కేంద్రీయ పాఠశాల ప్రారంభించడం జరిగిందని కేవలం ఈ ఐదు నెలల కాలంలోనే విద్యార్థులు ఎంతో క్రమశిక్షణ నైపుణ్యత కలిగి ఉన్నారని చెప్పారు. విద్యార్థులు ఉన్నత విద్యనే అభ్యసించి ఇదే నా సంస్థలోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా రావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ర్వహించడంతోపాటు సైన్స్ గణితం సంబంధించిన ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు

అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేయాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

విద్యార్థులకు, అంగన్వాడీకేంద్రాలకు ఇచ్చే కోడిగుడ్లు, చిక్కీలు నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని పిఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర తన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్‌ఒకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేయడం లేదన్నారుజ 50 గ్రాములు నుంచి 40 గ్రాములు ఉండాల్సిన కోడిగుడ్డు కేవలం 25 గ్రాములు మాత్రమే ఉంటోందన్నారు. కొన్ని చిక్కీలు కాలం చెల్లినవని, పురుగులు పడినవి ఉన్నాయని విమర్శించారు. వెంటనే అలాంటి ఏజెన్సీలను తక్షణమే రద్దుచేసి నాణ్యమైన పౌష్టికారాన్ని అందించ ఏజెన్సీలకు ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌యు నాయకులు దామోదర్ రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థుల క్రీడా స్ఫూర్తిని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అభినందించారు. ఇటీవలే జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఆర్ మానస (కబడ్డీ), ఆర్ లాస్యప్రియ (రగ్బీ), కె హర్షిని (హ్యాండ్ బాల్), కే పవిత్ర (హ్యాండ్ బాల్)ను కలెక్టర్ సత్కరించారు. జాతీయస్థాయి పోటీలలో కూడా ప్రతిభ కనబరచి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ జిల్లా అధికారి దేవరాజ్, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, పిఇటి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ రిజర్వ్ స్థలాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని మారుతి నగర్‌లో ప్రజల సామాజిక అవసరాల కోసం రిజర్వ్ చేయబడిన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతోందని ఆ స్థలాన్ని కాపాడాలని ఎపి ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు కేశాళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో బహుజన సమాజ్ పార్టీ ధర్మవరం ఇంచార్జి సాకే వినయ్ కుమార్ మద్దతుతో ఆర్డీవో మహేష్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతి నగర్ కాలనీవాసులు చాలా రోజులుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల కోసం కేటాయించిన స్థలాన్ని లక్ష్మీపతి అనే వ్యక్తి ఆక్రమించారని విమర్శించారు. ఎలాంటి హక్కులు లేకుండా సంవత్సరాలుగా ఆక్రమణ కొనసాగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే లక్ష్మీపతిపై చర్యలు తీసుకొని ఆక్రమించిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేష్, మారుతి నగర్ ఎస్సీ కాలనీ వాసులు, ప్రజలు పాల్గొన్నారు.

గృహం మంజూరులో అధికారి నిర్లక్ష్యం

గ్రీవెన్స్‌ను ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి - పరిగి

ఇటీవల కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో ఇల్లు బాధితులకు ఆసరా కల్పించడానికి చేపట్టిన పిఎం గృహ నిర్మాణ పథకంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల కొంతమందికి అన్యాయం జరిగింది. పరిగి మండలం తిరుమల దేవరాయపల్లికి చెందిన చౌడప్ప పురుషోత్తం అనే లబ్ధిదారులు ఇటీవలే నూతన ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారు.ఇంటి నిర్మాణం మంజూరు అయినప్పటికీ ఈ పంచాయతీలో పనిచేస్తున్న హౌసింగ్ ఇంజనీర్ నిర్లక్ష్యంతో మంజూరైన ఇంటికి జియోట్యాగ్ చేయలేదు. దరఖాస్తు గడువు ముగియడంతో అర్హులకు అన్యాయం జరిగింది. ఈ విషయంపై బాధితులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతి అందించారు.ఆయన నిర్లక్ష్య వైఖరి వల్లే తాము పిఎం ఆవాస్ యోజనకు దూరమయ్యామని సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ప్రజ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. వార్డు పర్యటనలో భాగంగా సోమవారం నింకంపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డైమండ్ బాబా, అంజి, జబీవుల్లా, గోపీనాథ్, వెంకటేష్, శంకరప్ప, ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి -గుడిబండ

స్థానిక ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప చేతుల మీదుగా రైతులకు సోమవారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు అతి తక్కువ ధరకే యూరియా కాంప్లెక్స్ ,వేపపిండి, టర్పన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి పన్నెండవ పిఆర్సీ కమిషన్‌ను నియమించి ముప్పై శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదకొండవ పిఆర్సీ కాల పరిమితి 2023 జూన్ నాటికి ముగిసిందని జులై 1 2023 నుండి పన్నెండవ పిఆర్సీ అమలు కావాల్సి ఉండగా రెండున్నర సంవత్సరాలు దాటినా నేటికీ కనీసం పిఆర్సీ కమిషన్ ను నియమించి పోవడం శోచనీయమన్నారు. ఇప్పటికే మూడు డిఎ లు పెండింగ్ లో ఉన్నాయని వచ్చే జనవరి నుండి మరోక డిఎ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని కోరారు. 30 నుంచి 35 ఏళ్లు ప్రభుత్వ సర్వీస్ లో ఉండి, సుదీర్ఘ కాలం సేవలందించి పదవీవిరమణ పొందిన వారు వచ్చిన సొమ్ముతో గృహ నిర్మాణం, పిల్లల పెళ్లిళ్ల చేయాలని డబ్బులు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన రోజే రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలన్నారు.గ్రాట్యుటీ, ఆఫ్ పే లీవ్,లీవ్ ఎన్ క్యాష్మెంట్ సొమ్ము చెల్లించకుండా సంవత్సరాల తరబడి పెండింగ్ లో పెడుతున్నారని దీని వల్ల రిటైర్డ్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులే భాగస్వాములవుతూ "మేము సైతం" అంటూ ముందుకు రావడం హర్షణీయమని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ మీటింగ్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో.. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహనతో తమ కుమార్తెలకు బాల్య వివాహం చేయబోమని వారి భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులుగా భాగస్వాములమవుతామని తల్లిదండ్రులు బాండ్ (అగ్రిమెంట్) రూపంలో కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమే కాకుండా బాలికల భవిష్యత్తును నాశనం చేసే చర్య అని స్పష్టం చేశారు. బాల్యవివాహ ముక్త భారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. బాల్య వివాహాలు చేయమని స్వచ్ఛందంగా బాండ్ సమర్పించిన తల్లిదండ్రులను కలెక్టర్ అభినందించారు. సత్యసాయి జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్, డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డిఎంహెచ్‌వో ఫిరోజ్ బేగం, డీపీవో సమత, డీసీపీవో మహేష్, ప్రొటెక్షన్ ఆఫీసర్లు నాగలక్ష్మి, మురళీధర్, కౌన్సిలర్ శివలతతో పాటు బాలికల తల్లిదండ్రులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం వ్యాప్తంగా అనుమతులు లేకుండా నిర్మాణం చేసిన భవనాలకు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం 2025, అదే విధంగా అక్రమ లే అవుట్లను సక్రమం చేసుకోవడానికి ఎల్ఆర్ఎస్ పథకాలను ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అన్నారు. బిపిఎస్, ఎల్ఆర్ఎస్ పథకాలపై పట్టణ వాసులకు అవగాహన కల్పించడం కోసం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏసిపి చంద్రమ్మ, టిపిఒ అబ్దుల్ సత్తార్ తో పాటు మున్సిపల్ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.